## జీ20 పార్లమెంట్ స్పీకర్ల సదస్సుకు కెనడా దుమ్మా

### భారత్‌తో ఏర్పడిన దౌత్య విభేదాలే కారణం?

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: న్యూఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగే జీ20 దేశాల పార్లమెంటరీ స్పీకర్ల శిఖరాగ్ర సమావేశానికి కెనడా హాజరు కావడం లేదు. ఈ సమావేశానికి హాజరు కారాదని కెనడా సెనెట్ స్పీకర్ రేమాండ్ గాగ్నే నిర్ణయించారు. ఇటీవల ఖలిస్థాన్ ఉగ్రవాది నిజ్జర్ హత్యపై భారత్-కెనడా మధ్య దెబ్బతిన్న దౌత్యపరమైన సంబంధాల కారణంగా ఈ సమావేశానికి హాజరు కారాదని కెనడా నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని నిర్ధారించిన కెనడా విదేశాంగ శాఖ తమ దేశం నుంచి ఈ సదస్సుకు ఎవరూ హాజరు కావడం లేదని స్పష్టం చేసింది. కాగా, ఈ జీ20 సదస్సు న్యూఢిల్లీలోని యశోభూమిలోని ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అడ్ ఎక్స్‌పో సెంటర్‌లో ఈ నెల 13,14 తేదీలలో జరుగుతుంది. జీ20 అధ్యక్ష హోదాలో భారత్ ఈ సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్నది.




| S No. | Gift | Winner Name | Coupon No. |
|---|---|---|---|
| 1 | 32" టెలివిజన్ | వివి. ఆదిశేషు | 56080 |
| 2 | మొబైల్ | విజయ్ | 19739 |
| 3 | మైక్రో ఓవెన్ | వి. ఓంకారం | 16656 |
| 4 | గిఫ్ట్ వోచర్ | జి. సత్తయ్య | 14581 |
| 5 | గిఫ్ట్ వోచర్ | జగదీష్ | 0002428 |




హైదరాబాద్ శివారు గుట్టల్లో ట్రెక్కర్లు గుర్తించిన రాతియుగపు ఆనవాళ్లు

## హైదరాబాద్ శివారుల్లో రాతియుగపు ఆనవాళ్లు

- గోడలపై తాబేళ్లు, చేప బొమ్మలు

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివారుల్లో రాతియుగపు ఆనవాళ్లు కనిపించాయి. గుట్టల్లో మధ్య యుగానికి చెందిన చిత్రాలు ప్రత్యక్షమయ్యాయి. ఓఆర్‌ఆర్ దగ్గర ఉన్న మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్కు వెనుక గుట్టల్లో ఉన్న ఈ చిత్రాలను ట్రెక్కర్లు మీర్ ఒమర్ అలీ ఖాన్, రిషబ్ గుర్తించగా, వారి సమాచారం మేరకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, చరిత్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎంఏ శ్రీనివాసన్‌తో సహా మరో ఆరుగురు విద్యార్థుల బృందం ఆ ప్రాంతాన్ని పరిశీలించింది. ఈ గుట్టపై ఒక పెద్ద రాయిపై మధ్య రాతి యుగానికి చెందిన మూడు తాబేళ్ల చిత్రాలు, ఒక చేప బొమ్మ, ఒక రేఖా చిత్రం ఎరుపు రంగులో గీసి కనిపించాయని బుధవారం శ్రీనివాసన్ పేర్కొన్నారు. పాము పడగ లాగ ఉన్న ఈ పెద్ద బండ రాయి మధ్య రాతి యుగపు మానవుల నివాసానికి అనువైన స్థలమని, అందుకే ఇక్కడ వాళ్లు గీసిన చిత్రాలు, నివసించిన ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు.

### రేపు పాస్‌పోర్ట్ ప్రత్యేక డ్రైవ్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): పాస్‌పోర్ట్ ప్రత్యేక డ్రైవ్ శనివారం కొనసాగుతుందని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి దాసరి బాలయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని బేగంపేట, అమీర్‌పేట, టోలిచౌకీతో పాటు నిజామాబాద్, కరీంనగర్, భువనగిరి, ఖమ్మం, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మేడ్చల్, నల్లగొండ, వరంగల్‌లోని పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవాకేంద్రాలు, పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల్లో సేవలు పొందొచ్చని చెప్పారు. www.passport.gov.inలో దరఖాస్తుదారులు అపాయింట్‌మెంట్స్ బుక్ చేసుకోవాలని చెప్పారు.

### విదేశాంగ మంత్రి జైశంకర్‌కు భద్రత పెంపు

న్యూఢిల్లీ: విదేశాంగ మంత్రి జైశంకర్‌కు కేంద్ర హోం శాఖ భద్రతను పెంచింది. ప్రస్తుతం ఆయనకు 'వై' క్యాటగిరీ కింద ఢిల్లీ పోలీసులు భద్రత కల్పిస్తున్నారు. దీన్ని 'జెడ్' క్యాటగిరీకి పెంచినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయనకు భద్రత కల్పించే బాధ్యతలను స్వీకరించాలని కేంద్ర రిజర్వు పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్)ను కేంద్ర హోంశాఖ ఆదేశించినట్లు తెలుస్తున్నది. దీంతో ఇకపై ఆయనకు నిరంతరం 14-15 మంది సాయుధ కమాండోలు భద్రత కల్పిస్తారు.

## ఓటర్ల జాబితాపై విచారణకు హైకోర్టు నిరాకరణ

### ఈఆర్వో వద్దనే తేల్చుకోవాలని స్పష్టీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): ఓటర్ల జాబితాలో సవరణపై విచారణ చేపట్టేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎవరికైనా అభ్యంతరాలుంటే వాటిని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో)కు విన్నవించుకోవాలని తెలిపింది. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలపై చట్టప్రకారం చర్య తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఓటర్ల జాబితాలో సవరణలపై ఎన్నికల కమిషన్‌ను సంప్రదించకుండా దాఖలు చేసిన పిటిషన్‌పై తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో బోగస్ ఓట్లను తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ గతంలో కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడిపోయిన మహమ్మద్ ఫిరోజ్‌ఖాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈఆర్వోలోని సెక్షన్ 21, 22, 23 కింద రివిజన్లు, సవరణలు, తొలగింపులు చేపట్టే అధికారం ఎన్నికల సంఘానికే ఉందని తేల్చి చెప్పింది. ఈఆర్ఓ ఇప్పటికే రివిజన్ ప్రక్రియ చేపట్టి ఈనెల 19న తుది జాబితాను ప్రకటించారని. ఈ జాబితాపై అభ్యంతరాలకు ఇప్పటికీ అవకాశం ఉన్నందున దానిని సద్వినియోగం చేసుకోవచ్చునని పిటిషనర్‌కు సూచించింది. పిటిషన్‌పై విచారణను మూసివేస్తున్నట్టు ప్రకటించింది.

## రెమిషన్ రికార్డులు సమర్పించండి

### బిల్కిస్ బానో కేసులో సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: బిల్కిస్ బానో కేసులో 11 మంది నిందితుల క్షమాభిక్షకు సంబంధించిన అన్ని ఒరిజినల్ రికార్డులను ఈ నెల 16లోగా తమకు సమర్పించాలని కేంద్రం, గుజరాత్ ప్రభుత్వాలను సుప్రీం కోర్టు గురువారం ఆదేశించింది. ఆగస్టులో ప్రారంభమైన ఈ కేసును జస్టిస్‌లు బీవీ నాగరత్న, ఉజ్జల్ భువన్ ధర్మాసనం విచారణను ముగించి తీర్పు రిజర్వ్ చేసింది. గోధ్రా రైలు దహనం అనంతరం 2002లో గుజరాత్ అల్లర్లలో ఐదు నెలల గర్భంతో ఉన్న బిల్కిస్ బానో అనే 21 ఏండ్ల యువతిపై కొందరు సామూహిక లైంగిక దాడికి పాల్పడటమే కాక, ఆమె మూడేళ్ల కుమార్తె సహా ఏడుగురు కుటుంబ సభ్యులను దారుణంగా హతమార్చారు. ఈ కేసులో 11 మంది ముద్దాయిల శిక్షాకాలం పూర్తి కాకుండానే గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష పేరుతో ముందస్తుగా విడుదల చేసింది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ జరిపింది.





































